క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



శ్రీలక్ష్మీనరసింహుడి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవం రంగరంగ వైభవంగా నిర్వహించారు. గురువారం స్వాతి నక్షత్రంతో పాటు స్వామివారి జన్మదినం కావడంతో టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించారు. ముత్యాల తలంబ్రాలతో స్వామివారి పెళ్లివేడుక నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్యధారణ కావించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారి ఎదుట యజ్ఞహోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పెద్ద ఎత్తున భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారిని సేవించుకొన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

సీఓల నియామకం

పెద్దతిప్పసముద్రం: స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్ల (సీఓ)ను డిప్యుటేషన్‌పై నియమిస్తూ డ్వామా పీడీ వెంకటరత్నం ఉత్తర్వులు పంపినట్లు ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఏపీఓ తిరుపాలప్పలు తెలిపారు. మదనపల్లి, ములకలచెరువులో పని చేస్తున్న శ్రావణ్‌కుమార్, శివకుమార్‌ను పీటీఎం సీఓలుగా నియమించారని పేర్కొన్నారు.

కొండపై తగ్గని రద్దీ



గాలిబండపై నుంచి ప్రకృతి అందాలు తిలకిస్తున్న సందర్శకులు

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై గురువారం సందర్శకుల రద్దీ తగ్గలేదు. మేఘాలు కమ్ముకుని జల్లులతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనడంతో ఆస్వాదించేందుకు సందర్శకులు కొండకు క్యూ కట్టారు. గాలిబండ, అటవీసముదాయంలో సందర్శకుల రద్దీ అధికంగా కనిపించింది. తమిళనాడు, కర్ణాటకలకు చెందిన సందర్శకులు అధిక సంఖ్యలో వచ్చారు.

పక్కా గృహాల తనిఖీ

పెద్దతిప్పసముద్రం: పీటీఎం సమీపంలోని హౌసింగ్ లేఅవుట్‌ను గురువారం ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం ఆయన అంకిరెడ్డిపల్లిలోని గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రజలతో సన్నిహితంగా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ మెకానిక్ చంద్రశేఖర్ ఉన్నారు.

భూముల విలువ తగ్గించండి

బి.కొత్తకోట: కరువు మండలాలైన బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం పరిధిలో ప్రభుత్వం పెంచిన భూముల విలువను తగ్గించాలని కోరుతూ గురువారం స్థిరాస్తి వ్యాపారుల సంఘం బి.కొత్తకోట సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఈ మండలాల్లో వర్షాలు లేక అన్ని రంగాలు కుదేలయ్యాయని, దీనిపై ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిందని గుర్తు చేశారు. వ్యవసాయ భూములు తప్ప ఇంటి నివేశ స్థలాల క్రయ విక్రయాలు భారీగా తగ్గిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో పెంచిన భూముల విలువను తగ్గించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సంఘానికి చెందిన చంద్రమోహన్, మాలిక్, నాసిర్, ప్రసాద్, విశ్వనాథ్, రవిశేఖర్‌రెడ్డి కోరారు.

ఇంటర్ లాకింగ్ ఇటుకలపై పేటెంట్



పేటెంట్ పత్రంతో అధ్యాపకులు, విద్యార్థులు

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె. అనిత, నక్కీరన్, దీపాంకర్‌రాయ్, బిటెక్ ఆఖరి సంవత్సరం విద్యార్థి ఎ.వైష్ణవి గ్రిప్ టైట్ ఇంటర్ లాకింగ్ ఇటుకల రూపకల్పనపై పేటెంట్ హక్కులు సంపాదించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ గురువారం తెలిపారు. దీని ద్వారా గోడలు, తోటపడకలు, మార్గాలు, అంచులు, పునాదులు, అంతర్గత, బాహ్య గోడలను నిలుపుకోడానికి ఒకదానికొకటి సరిపోయేలా ఉపయోగపడతాయన్నారు. వివిధ ఆకారాల్లో ఇటుకలు తయారు చేసి గోడలకు బలం చేకూరేలా తయారు చేయడానికి ఈ పేటెంట్ వాడుతామన్నారు. సివిల్ ఇంజినీరింగ్‌లో కొత్త టెక్నాలజీగా కేంద్ర ప్రభుత్వంచే గుర్తింపు లభించిందన్నారు. కరస్పాండెంట్ ఎన్. విజయభాస్కర్ చౌదరి అభినందించారు.

తవ్వుకునోడికి తవ్వుకున్నంత!

ఏ వ్యాపారమైనా సప్లయ్, డిమాండ్ సూత్రంగా సాగుతుంది. డిమాండ్ ఎక్కువైనప్పుడు భారీ లాభాలు కళ్ల చూడవచ్చు. ఇదే సూత్రాన్ని అక్రమార్కులు ఫాలో అవుతున్నారు. యథేచ్ఛగా మట్టి, మొరం కొల్లగొట్టి లక్షలు గడిస్తున్నారు. ప్రకృతి సంపద హరించుకుపోతున్నా.. అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందనే విమర్శలు వస్తున్నాయి.

- మట్టి, మొరం అక్రమ రవాణా
- అనుమతులు లేకుండా తరలింపు
- రూపురేఖలు కోల్పోతున్న గుట్టలు, చెరువులు



ఖండ్రిగ గ్రామ సమీపంలోని ఓ గుట్టను ఎక్స్‌కవేటర్‌తో తోడేస్తున్న అక్రమార్కులు

గుర్రంకొండ: మట్టి, మొరం కోసం రియల్‌ఎస్టేట్ వ్యాపారులు గుట్టలు, చెరువులను తోడేస్తున్నారు. ఎక్స్‌కవేటర్ల ద్వారా ఇష్టానుసారంగా రాత్రిపగలు తేడా లేకుండా తవ్వేస్తుండడంతో గుట్టలు,చెరువులు రూపురేఖలు కోల్పోతున్నాయి. మట్టి వ్యాపారం పలువురికి కాసుల వర్షం కురిపిస్తుండడం గమనార్హం.

కొరవడిన పర్యవేక్షణ

మండలంలోని పలు గ్రామాల్లో దళారులు, వ్యాపారులు ఇష్టానుసారం మట్టిని తోడేస్తున్నా సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గుర్రంకొండ, ఖండ్రిగ గ్రామాల పరిసరాల్లోని పలు, గుట్టలు, చెరువుల్లో ఎక్స్‌కవేటర్ల ద్వారా ఇష్టానుసారంగా మట్టిని తోడేసి అక్రమంగా తరలించుకుపోయారు. పట్టణంలో పెద్ద ఎత్తున ఇటుకల బట్టీలు నిర్వహిస్తున్నారు. ఇందులో వందల లోడ్ల మట్టిని తరలించడం కోసం నానా అడ్డదారులు తొక్కుతున్నారు. వీరే కాక రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ ప్లాట్లను చదును చేసుకోవడానికి, ఎక్స్‌కవేటర్లతో చెరువులను అక్రమంగా తోడేసి మట్టిని ట్రాక్టర్లలో తరలించేస్తున్నారు. మూడురోజులుగా వ్యాపారులు, దళారులు అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో అక్రమ మట్టి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది.

అధికారుల ఆదేశాలు భేఖాతర్

గుట్టలు, చెరువుల్లో అక్రమంగా మట్టి తరలించకూడదంటూ స్థానిక రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా రియల్ వ్యాపారులు, దళారులు ఖాతరు చేయడం లేదు. రెండు రోజుల క్రితం ఓ రియల్ ఎస్టేట్ కండ్రిగ గ్రామ పరిధిలోని ఓ గుట్టను తవ్వేశాడు. స్థానిక రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి సదరు రియల్ వ్యాపారిని మందలించినా ఖాతరు చేయకుండా మట్టిని తరలించుకుపోతున్నారు.

టిప్పర్‌ను సీజ్ చేశాం



కండ్రిగ గ్రామం వద్ద అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఓ టిప్పర్‌ను సీజ్ చేశాం. గుట్టలు, చెరువుల్లో మట్టిని తరలించడానికి ఎవరికి అనుమతి ఇవ్వలేదు. అవసరమైన సరైన ప్రతిపాదనలతో అనుమతి కోరితే పరిశీలిస్తాం. రియల్ వ్యాపారుల కోసం మట్టిని తీసుకెళితే చట్ట పరంగా చర్యలు తీసుకొంటాం.

– కె. శ్రీనివాసులు, తహసీల్దార్, గుర్రంకొండ

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



గుర్రంకొండ: అర్జీలు స్వీకరిస్తున్న రాయచోటి డీఎల్‌డీఓ, తహసీల్దార్



పీలేరురూరల్ : రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

పీలేరురూరల్ : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్. రమ అన్నారు. గురువారం మండలంలోని వేపులబైలులో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 30 అర్జీలు వచ్చాయని, ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి 45 రోజుల్లోపు అర్జీలు పరిష్కరించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భీమేశ్వర్‌రావు, నోడల్ ఆఫీసర్ భరత్‌కుమార్‌రెడ్డి, సర్వేయర్ కిరణ్మయిపాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి భూ సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమని నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ శ్రీరాములు నాయక్ అన్నారు. గురువారం మండలంలోని రంగసముద్రంలో జరిగిన సదస్సులో వచ్చిన మొత్తం 32 మంది అర్జీదారులకు రశీదులు ఇచ్చామన్నారు. సర్పంచ్ శివ, ఆర్‌ఐ బాలాజీ, సర్వేయర్ శ్రీవాణి, వీఆర్‌ఓలు రామకృష్ణ, అహ్మద్ పాల్గొన్నారు.

దారి చూపండి సారూ..!

గుర్రంకొండ: మండలంలోని ఆమిలేపల్లె పంచాయతీ దిగువ అమిలేపల్లెలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు పలు రెవెన్యూ సమస్యలపై అధికారులకు అర్జీలు ఇచ్చారు. గ్రామంలోని సమీప పొలాలకు వెళ్లేందుకు దారి సరిగాలేదని పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. వెంటనే సర్వే చేసి దారి సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. భూ రీసర్వేలో తమకు అన్యాయం జరిగిందంటూ రైతులు అర్జీలు ఇచ్చారు. తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్‌ఓ ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

కలిచెర్లలో రెవెన్యూ సదస్సు

పెద్దమండ్యం: మండలంలోని కలిచెర్ల గ్రామ సచివాలయం వద్ద గురువారం అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జింకా విశ్వనాథ అధ్యక్షతన జరిగన సదస్సులో తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ ప్రజలు, రైతుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ వెంకటదాస్, ఆర్‌ఐ రమేష్, వీఆర్‌ఓ ఆంజనేయులు నాయక్ పాల్గొన్నారు.

రామసముద్రం : మండంలోని ఎలవానెల్లూరు గ్రామపంచాయతీలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ నిర్మలాదేవి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూసమస్యలకు సంబంధించిన పత్రాలు ఇచ్చి నమోదుచేసుకోవాలన్నారు. వివిధ సమస్యలపై 20 అర్జీలు వచ్చాయని, త్వరలో పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. సర్పంచ్ ఉదయ్‌శంకర్‌రెడ్డి, మండల సర్వేయర్ నాగరాజు, ఆర్‌ఐ వసీంఅక్రమ్ పాల్గొన్నారు.

మురాద్‌బీ వంక ఆక్రమణపై సర్వే



మురాద్‌బీకుంట వంకను సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

గుర్రంకొండ: మండలంలోని కండ్రిగ గ్రామంలో ఆక్రమణకు గురైన మురాద్‌బీ వంకను రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. గురువారం వీఆర్‌ఓలు సదాశివ, అమీర్, సర్వేయర్లు వినోద్, నందిని వంకను పరిశీలించారు. సర్వే నంబర్ 503లో మొత్తం 10.44 సెంట్లు భూమి ఉంది. ఇందుకో కొంత చుక్కలు, ప్రభుత్వ భూమి ఉంది. ఇందులోనే 503–8లో మురాద్‌బీ కుంటకు వెళ్లే వంక ఉంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం వంక మొత్తం 1.01 ఎకరాలుగా ఉంది. వీటితోపాటు 501,502 సర్వే నంబర్లలో ఉన్న వంకను సర్వేచేశారు. అయితే కొంతమంది వ్యక్తులు వంక స్థలాలను ఆక్రమించేశారు. ఆక్రమించుకొన్న స్థలాల్లో ఇళ్లు, నర్సరీలు, ఇతర వ్యాపారసముదాయలు నిర్మించుకొన్నారు. దీంతో రెవెన్యూ అధికారులు వంకను సర్వే చేసి కొలతలు తీశారు. ఇందులో 25 సెంట్ల మేరకు వంక ఆక్రమణకు గురైనట్లు తేల్చారు. ఆక్రమణకు గురైన వంక మొత్తాన్ని జేసీబీతో కందకాలు తవ్వించడంతో పాటు బోర్డులు కూడా ఏర్పాటు చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ

మదనపల్లె సిటీ: మదనపల్లెలో శనివారం జరిగే ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ తెలిపారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మదనపల్లె పట్టణం బెంగళూరు రోడ్డులోని జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో సభలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ వద్ద నుంచి ర్యాలీగా మెట్రోసర్కిల్ మీదుగా జీఆర్‌టీ ఉన్నత పాఠశాల వరకు జరుగుతుందన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షులు వి.పి.సాను, ఎస్.కె యూనివర్సిటీ రిటైర్డు వీసీ వెంకట్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, ఉపాధ్యక్షులు పరమేష్‌లు హాజరై ప్రసంగిస్తారన్నారు. సమావేశంలో పట్టణ నాయకులు జయబాబు, ఆఫ్రీద్, ప్రేమ్‌కుమార్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బి.కొత్తకోట: ఐసీడీఎస్ బి.కొత్తకోట ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక కార్యకర్త, ఆయా పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ కే.భాగ్యమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నవాబుకోట అంగన్‌వాడీ కార్యకర్త (బీసీ–ఎ), ఆయా పోస్టులు పీటీఎం–2 (ఓసీ), బూర్లపల్లి–1 (వీహెచ్), గుండాలవారిపల్లె (ఎస్‌టీ), ఉప్పరోళ్లపల్లె (ఓసీ), గుంటిపల్లి (ఎస్‌సీ), కనుగొండువారిపల్లె (బీసీ–డీ), నామాలపల్లి (బీసీసీ), మొగసాలమర్రి (ఓసీ), కొండువారిపల్లి (ఓసీ) పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. 2024 జూలై ఒకటి నాటికి 21 నుంచి 35 ఏళ్ల వయసు కలిగి, 10వ తరగతి పాసైన వివాహితులు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. దరఖాస్తులను బి.కొత్తకోట కార్యాలయంలో పొంది వాటిని జనవరి రెండో తేదీలోపు అందజేయాలని కోరారు.

టీఎన్‌టీయూసీలో చీలికలు సహించం

మదనపల్లె : టమాటా మార్కెట్‌లోని కార్మికులందరూ ఐకమత్యంతో 23 ఏళ్ల క్రితం టీఎన్‌టీయూసీ ట్రేడ్ యూనియన్‌ను ఏర్పాటు చేసుకున్నారని, ఎమ్మెల్యే పేరు చెప్పి కొందరు దళారులు, వ్యాపారులు కార్మికుల ఐక్యతను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తే సహించేది లేదని గౌరవాధ్యక్షులు ఎస్.ఎ.మస్తాన్ స్పష్టం చేశారు. గురువారం మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన టీఎన్‌టీయూసీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 13న తెలుగునాడు ట్రేడ్ యూనియన్ రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు, నిబంధనల ప్రకారం ఓటింగ్ పద్ధతిలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని తెలిపారు. అయితే మార్కెట్‌లోని కొందరు వ్యాపారులు, దళారీలు కార్మికుల ఐక్యతను దెబ్బతీసేందుకు, ఎమ్మెల్యే ప్రోద్బలంతో మూడురోజుల క్రితం టీఎన్‌టీయూసీ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ప్రకటించారన్నారు. ట్రేడ్ యూనియన్లలో రాజకీయనాయకులు, వ్యాపారులు, దళారులు ఉండరని, కార్మికుల మధ్య విభేదాలు సృష్టించి, రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారనే విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ

మదనపల్లె : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో వివిధ రకాలైన సేవలు అందిస్తున్న వారికి, ఎన్‌ఎస్‌డీసీ ద్వారా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల తెలిపారు. మున్సిపల్ కార్యాలయం గురువారం విడుదల చేసిన ప్రకటనలో శిక్షణ అనంతరం సర్టిఫికేట్‌తో పాటు అర్హత పొందిన వారికి హోమ్ ట్రయాంగిల్ ఫ్లాట్‌ఫారం ద్వారా ఆన్‌బోర్డ్ చేసి జీవనోపాధి కల్పిస్తామన్నారు. పట్టణంలో ఆసక్తి కలిగిన ప్లంబర్లు, పెయింటింగ్, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ, గీజర్, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్‌మెషిన్ రిపేరీ, బ్యూటీషియన్(పురుషులు, స్త్రీలు) ఈనెల 27వ తేదీ నుంచి 30 వతేదీలోపు మెప్మా కార్యాలయంలో రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసుబుక్, పాన్‌కార్డు జిరాక్స్ తీసుకెళ్లి తమ వివరాలను నమోదుచేసుకోవాలన్నారు.

విద్యుత్ బాదుడుపై నేడు పోరుబాట

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు పెంచేది లేదు.. అవసరమైతే తగ్గిస్తామని ప్రజలకు హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు అధికారం చేపట్టాక ప్రజలపై చార్జీలతో బాదుతున్నారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. శుక్రవారం బి.కొత్తకోటలో విద్యుత్ చార్జీల బాదుడుపై పోరుబాటు కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పేదలు, చిరు వ్యాపారులు విద్యుత్‌చార్జీల భారం మోయలేని పరిస్థితుల్లో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం బి.కొత్తకోటలో విద్యుత్ చార్జీల భారంపై పోరుబాట కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 9:30 గంటలకు స్థానిక బీసీకాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి నిరసన ర్యాలీ ప్రారంభించి బీరంగిరోడ్డు, జ్యోతిచౌక్, మెయిన్‌రోడ్డు మీదుగా దిగువబస్టాండ్ వరకు సాగుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట

పీలేరు : కరెంట్ చార్జీలు తగ్గించాలనే డిమాండ్‌తో శుక్రవారం పీలేరులో వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమం చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన పీలేరులో శుక్రవారం ఉదయం 10 గంటలకు వీఎస్ఆర్ కల్యాణవేదిక నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

కలకడ : మండలంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని విద్యుత్ వినియోగదారులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి తరలిరావాలని కన్వీనర్ కమలాకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పీలేరులో చేపడుతున్న నిరసన ర్యాలీని కార్యకర్తలు నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

పోరుబాటను విజయవంతం చేయండి

మదనపల్లె : వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు శుక్రవారం పెరిగిన విద్యుత్ ఛార్జీలపై నిర్వహిస్తున్న పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ కోరారు. గురువారం మదనపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... పట్టణంలోని సీటీఎం రోడ్డు ఎస్టేట్‌లో ఉన్న ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ కార్యాలయం ఎదుట శుక్రవారం 10 గంటలకు నిరసన తెలిపి, సంబంధిత అధికారులకు వినతిపత్రం ఇవ్వడం చేస్తామన్నారు. పోరుబాట కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొంటారని తెలిపారు.

మదనపల్లె మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి తదితరులు చిత్రంలో ఎమ్మెల్యే

మదనపల్లె : మదనపల్లె పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం, బడ్జెట్ ప్రత్యేక సమావేశం జరిగింది. ఎమ్మెల్యే షాజహాన్ బాషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో భాగంగా సాధారణ సమావేశంలో 31 అంశాలతో ప్రతిపాదించిన అజెండాను, 2025–26 సంవత్సరానికి తయారుచేసిన బడ్జెట్ అంచనాలు, 2024–25 సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. గాంధీరోడ్డులో ఆక్రమణపై ఫిర్యాదుచేసి, 3నెలలు కావస్తోందని, తీసుకున్న చర్యలపై కౌన్సిల్‌కి తెలపాల్సిందిగా 13వవార్డు కౌన్సిలర్ ఫర్జానా రఫీ కోరారు. తన వార్డులో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రోటోకాల్ ప్రకారం తమకు సమాచారం అందించడం లేదని 14వవార్డు కౌన్సిలర్ షబానా ఆరోపించారు.

రూ.114.59 కోట్లతో బడ్జెట్ ఆమోదం

మదనపల్లె మున్సిపాలిటీ ఆర్థిక సంవత్సరం 2024–25కు సవరించిన బడ్జెట్ అంచనాలను, 2025–26నకు మున్సిపల్ అధికారులు తయారుచేసిన బడ్జెట్ అంచనాలను కౌన్సిల్ పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. 2025–26 ఆర్థికసంవత్సరానికి అన్ని పద్దుల కింద సాధారణ, మూలధన రాబడి ప్రారంభ నిల్వతో సహా 228.44 కోట్లతో బడ్జెట్ అంచనాను ఆమోదించారు. అందులో మూలధనఖర్చు 113.85 కోట్లు చూపి, 114.59 కోట్లు ముగింపునిల్వ బడ్జెట్‌గా పేర్కొన్నారు. 2024–25కు సంబంధించి, 9నెలలుగా వివిధ రూపాల్లో మున్సిపాలిటీకి రావాల్సిన స్టాంపు డ్యూటీ, ప్రకటనచార్జీలు రూపంలో వచ్చిన ఆదాయం, వాహనాలకు సంబంధించి డీజిల్, ఇన్సూరెన్స్‌కు ఖర్చుచేసిన వ్యయాలను కౌన్సిల్‌కు తెలపాలని వైస్‌చైర్మన్ జింకా చలపతి కోరారు.

సమసమాజ స్థాపనే సీపీఐ లక్ష్యం



పీలేరు : మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్



ములకలచెరువు: సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

పీలేరు : భారతదేశంలో సమసమాజ స్థాపనే లక్ష్యంగా సీపీఐ నిరంతర పోరాటాలు కొనసాగిస్తున్నదని ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో వంద సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కల్గిన సీపీఐ పార్టీ అనేక త్యాగాలు చేసి నిర్బంధాలు ఎదుర్కొని పీడిత ప్రజల గొంతుకై పోరాటాలు చేసిందని పేర్కొన్నారు. దున్నేవాడిదే భూమి అనే నినాదంతో పేద ప్రజలకు భూములు పంచిన చరిత్ర సీపీఐది అని తెలిపారు. స్వతంత్ర్య సంగ్రామంలో పాల్గొని దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పోరాడినట్లు తెలిపారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నరసింహులు, శ్రీకాంత్, రమణ, యశోద, సౌజన్య, శ్యామల, వెంకటరమణ, రాణి పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

ములకలచెరువు: సీపీఐ పార్టీ ఆవిర్భవించి 100 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు గురువారం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించి నినాదాలు చేశారు. వందేళ్లలో ప్రజల వైపు చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప, నాయకులు మల్లికార్జున, రమేష్, చంద్ర, నిజాముద్దీ ఉన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌లతో విద్యుత్ ఆదా



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్‌ఈ రమణ

పీలేరు : ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద పేద, మధ్యతరగతి కుటుంబాలు తమ ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌లను నిర్మించుకోవడం ద్వారా విద్యుత్ ఖర్చును ఆదా చేసుకోవచ్చని ట్రాన్స్‌కో ఎస్‌ఈ రమణ అన్నారు. గురువారం స్థానిక ఈఈ కార్యాలయంలో నియోజకవర్గంలో ఆరు మండలాల క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు చేసుకొనుటకు ఒక కిలో వాట్ సామర్థ్యంకు రూ. 30 వేలు, రెండు కిలో వాట్ సామర్థ్యంకు రూ. 60 వేలు, మూడు కిలో వాట్స్ సామర్థ్యంకు రూ. 78 వేలు చొప్పున ప్రభుత్వం రాయితీ అందిస్తుందని తెలిపారు. అంతేగాక రాయితీ గాక మిగిలిన మొత్తానికి బ్యాంకులు తక్కువ రుణాలు ఇస్తాయన్నారు. చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ ఈఈలు అమీర్‌బాషా, శివయ్య, ఏఈలు, జేఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

కలకడ : సోలార్ విద్యుత్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఈ రమణ కోరారు. గురువారం మండలంలోని కలకడ కొత్తపల్లె, గోపాలపురం ఎస్సీకాలనీ తదితరల గ్రామాల్లో పర్యటించి ప్రధానమంత్రి సూర్య ఘర్‌యోజన పథకం వినియోగదారుల నమోదు ప్రక్రియ పురుగతిని ఆయన పరిశీలించారు. ప్రతి వినియోగదారుడు ప్రభుత్వం అందించే సోలార్ పథకాన్ని విద్యుత్ శాఖ సిబ్బంది ద్వారా కానీ, ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సోలార్ లైట్ ట్రాప్స్ పంపిణీ

నంబేపల్లె: ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రైతులకు సోలార్ లైట్ ట్రాప్స్ గురువారం పంపిణీ చేశారు. ఐసీఐసీఐ సంస్థ అధికారులు మాట్లాడుతూ మండలంలోని గురిగింజకుంటలో రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గించేందుకు సోలార్ ట్రాప్స్, బిట్టరీ స్ప్రేర్స్ బయో ఇన్‌పుట్స్, ఉపాధి పరికరాలు ఇచ్చినట్లు తెలిపారు. భూమి లేనివారికి నాటుకోళ్లు పంపిణీ చేస్తున్నామని, రైతుల పొలాల్లో ఇంకుడు గుంతలు, చేపడుతున్నామని తెలిపారు. భూగర్భ జలాలు పెంపొందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజేశ్వరి, సునీత, వెంకటకుమార్, ధరణేశ్వరి, మధుసూదన్, రైతులు పాల్గొన్నారు.

డివైడర్



వారపుసంత వద్ద విరిగిపోయిన డివైడర్ రేకు

మదనపల్లె పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాటుచేసిన డివైడర్లు ప్రమాదంగా మారాయి. స్థానిక వారపు సంత, ఆర్టీసీ బస్టాండు, మల్లికార్జునసర్కిల్, టౌన్ బ్యాంకు సర్కిల్ ప్రాంతాల్లో ఇనుప రేకులతో డివైడర్లు ఏర్పాటుచేశారు. వాహనాల రాకపోకల సమయంలో డివైడర్లను ఇతర వాహనాలు ఢీకొనడంతో రేకులు వంగిపోయి ప్రస్తుతం ప్రమాదంగా మారాయి. విరిగిన డివైడర్లను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – మదనపల్లె సిటీ



ఆర్టీసీ బస్టాండు వద్ద వంగిపోయిన డివైడర్ రేకు